## ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించాలి

- నియోజకవర్గంలో 17 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు
- ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు

ఇబ్రహీంపట్నం, మే 12 : ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో సోమవారం జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరుగటానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఆయా గ్రామాలకు బందోబస్తు నిర్వహణ సిబ్బంది తరలివెళ్లారు. డివిజన్‌లో 550మంది పోలీసులను నియమించినట్లు తెలిపారు. మొబైల్ పోలీసులు, స్పెషల్‌స్టైటింగ్ సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 17 సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ఇబ్రహీంపట్నంలో 3, మంచాల 2, యాచారం 2, ఆదిబట్ల 2, అబ్దుల్లాపూర్‌మెట్ 1, హయత్‌నగర్ 4, నాగోల్ 1, వనస్థలిపురంలో 1 గుర్తించినట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాల్లో అదనపు ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. 144సెక్షన్ లోపల ఎలాంటి ప్రచారాలు నిర్వహించవద్దని, ఘర్షణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలంతా పోలీసులకు సహకరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషిచేయాలన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, మే 12: వాసుదేవ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్‌తండాకి చెందిన శోభన్, కార్డియాతండాకి చెందిన లలిత మృతి చెందారు. ఆదివారం విషయం తెలుసుకున్న రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, కడ్తాల్ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ట్రస్టు తరఫున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అందజేసిన వారిలో ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, నాయకులు సుమన్, రామకృష్ణ, రాజు, రవి, తండావాసులు ఉన్నారు.

### షాద్‌నగర్ నియోజకవర్గంలో..

## 263కేంద్రాలు.. 2,38,478మంది ఓటర్లు

**విధులు నిర్వహించనున్న 2369మంది సిబ్బంది, పోలీసులు, వైద్య సిబ్బంది**


వివరాలను ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ ఐపీఎస్‌కు వివరిస్తున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వెంకటమాధవరావు

షాద్‌నగర్‌టౌన్, మే 12: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు షాద్‌నగర్ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వెంటకమాధవరావు ఆదివారం తెలిపారు. మినీ స్టేడియంలోని ఎన్నికల ఏర్పాట్లను మహబూబ్‌నగర్, చేవెళ్ల ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ ఐపీఎస్ కాల్ రామ్‌రావత్, శంషాబాద్ డీసీపీ నారాయణ రెడ్డి, అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్ పరిశీలించారు.1500మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటారని తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలో మొత్తం 263కేంద్రాల వద్ద అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని మినీ స్టేడియంలో 263కేంద్రాలకు సంబంధించిన ఈవీఎం, వీవీప్యాట్, ఇతర పరికరాలను ఎన్నికల సిబ్బందికి సమావేశం నిర్వహించి అందజేశారు. మినీ స్టేడియం ప్రాంగణంలో పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పేర్లు, రూట్లను బూత్ అధికారులకు వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, ఒక గార్డు, ఒక వెబ్‌కాస్టింగ్ అందుబాటులో ఉంటారని తెలిపారు. 278 మంది వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసిన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, ఎంఈవో శంకర్‌రాథోడ్, ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ ప్రతాప్‌లింగం, ఏడీ రాజారత్నం, ఏవో నిశాంత్‌కుమార్, వివిధ మండలాల ఎంపీడీవోలు, వివిధశాఖల అధికారులు, వైద్యాధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

**నియోజకవర్గంలో 263పోలింగ్ కేంద్రాలు..**

షాద్‌నగర్ నియోజకవర్గంలో 263పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 2,38,478మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 1,19,042మంది, స్త్రీలు 1,19,422మంది, ట్రాన్స్‌జెండర్స్ 14మంది ఉన్నారు.

**నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు**

ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని షాద్‌నగర్ పోలీసులు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఓటు వేసేందుకు ఓటర్లను రాజకీయ పార్టీలకు సంబంధించిన వాహనాల్లో తరలించరాదని, మద్యం సేవించిన వారికి పోలింగ్ కేంద్రంలోకి అనుమతి ఉండదనే విషయాన్ని గమనించాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఒక డీసీపీ, అడిషనల్ డీసీపీ, ఇద్దరు ఏసీపీలు, ఏడుగురు సీఐలు, 10మంది ఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు 67, డబ్ల్యూపీసీ 175, హోమ్ గార్డ్స్ 157, స్పెషల్ ఫోర్స్ 52మంది, కేంద్ర బలగాలు 120 మంది పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని వివరించారు.

**11 సమస్యాత్మక కేంద్రాలు**

నియోజకవర్గంలో 11 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని ఏసీపీ రంగస్వామి తెలిపారు. ఓటర్లకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని వివరించారు.


డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న అధికారులు, సిబ్బంది


ఎన్నికల నిర్వహణ సంబంధించిన సామగ్రితో బస్సు ఎక్కుతున్న అధికారులు


ఈవీఎం, వీవీప్యాట్లను పోలింగ్ బూత్‌లకు తరలిస్తున్న అధికారులు, మున్సిపల్ సిబ్బంది


కడ్తాల్ : మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లోకి ఎన్నికల సామగ్రితో వస్తున్న అధికారులు


ఆమనగల్లు : మండల పరిషత్ కార్యాలయం పోలింగ్ స్టేషన్ ముందు పోలింగ్ సామగ్రితో సిబ్బంది

# ఓటుకు వేళాయె..

- నేటి ఎన్నికకు సర్వం సిద్ధం
- పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు, సిబ్బంది
- పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు
- 144 సెక్షన్ అమలు


మొయినాబాద్ : హిమాయత్‌నగర్‌లో పోలింగ్ కేంద్రంలో పోలీసుల బందోబస్తు

కడ్తాల్, మే 12: మండలంలోని బూత్‌ల్లో ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 24 గ్రామ పంచాయతీల్లో ఇది వరకు 35 ఎన్నికల బూత్‌లు ఉండగా, పెద్దవేములోనిబావి తండాలో 276 ఓటర్లు, గోవిందాయిపల్లి తండా 797 ఓటర్లు, గడ్డమీది తండా 319 ఓటర్లు ఉండగా, తాజాగా మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసిన్నట్లు తహసీల్దార్ ముంతాజ్ తెలిపారు. మండలంలో మొత్తం ఓటర్లు 33,723 ఓటర్లకుగానూ పురుషులు 17,297 మంది, స్త్రీలు 16,425 మంది, ఇతరులు ఒకరు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. పోలింగ్ బూత్‌ల్లో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు తెలిపారు. అన్ని పోలింగ్ బూత్‌లకు ఎన్నికల అధికారులు ఈవీఏంలు, ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు.

**అబ్దుల్లాపూర్‌మెట్** : లోక్‌సభ ఎన్నికలకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ రవీందర్‌దత్తు తెలిపారు. మండలంలో మొత్తం 1,78,188 మంది ఓటర్లు ఉండగా 163 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పురుషులు 90,281 మంది, మహిళలు 87,877 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఓటరు కార్డు లేనిచో ఈసీ నిర్దేశించిన 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానిని వెంట తెచ్చుకొని ఓటు వేయవచ్చన్నారు. ఓటరుకార్డు, ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, ఫొటోతో ఉన్న పోస్టాఫీస్/బ్యాంక్ పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వశాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సురెన్స్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, లేబర్ గుర్తింపుకార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటోతో ఉన్న ఫెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల గుర్తింపుకార్డు తదితర వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని సూచించారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా, సీసీ కెమెరాల నిఘాలో పోలింగ్ జరిపేలా ఏర్పాట్లు చేశామన్నారు.

**ఆదిబట్ల** : నేడు జరుగబోయే పార్లమెంట్ ఎన్నికలకు ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాట్లను పూర్తి చేశామని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు 16 పోలింగ్ బూత్‌లు, 9 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని కోరారు.

**పెద్దఅంబర్‌పేట** : పార్లమెంట్ ఎన్నికల కోసం మున్సిపాలిటీలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పెద్దఅంబర్‌పేట, పసుమాముల, కుంట్లూరు, తట్టిఅన్నారం, మర్రిపల్లిలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఎన్నికల కోసం ఈవీఎంలతో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

**మండలంలో మూడు మాడల్ పోలింగ్ స్టేషన్లు**

మొయినాబాద్ : పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో బూత్‌లను ఏర్పాటు చేసుకున్నారు. మండలంలో 65 పోలింగ్ బూత్‌లు ఉండగా వాటిని పర్యవేక్షించడానికి 5 రూట్లను ఏర్పాటు చేశారు.

**మండలంలో మూడు ప్రత్యేక పోలింగ్ బూత్‌లు**

మండలంలో అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, ఎతుబార్‌పల్లి గ్రామాల్లో పోలింగ్ బూత్‌ను మాడల్ పోలింగ్ స్టేషన్లుగా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ గౌతంకుమార్, ఆర్‌ఐ చంద్రమోహన్లు పర్యవేక్షించారు.

**నందిగామ** : మండలంలో 26854 ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 13388, మహిళలు 13463, ఇతరులు ముగ్గురు ఉన్నారు. మొత్తం 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మయ్య తెలిపారు.

**యాచారం** : మండలంలో 59పోలింగ్ బూతులను ఏర్పాటు చేశారు. 24గ్రామపంచాయతీలకు 48,656 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 24,351మంది పురుషులు ఉండగా 24,351మంది స్త్రీలు, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నట్లు తహసీల్దార్ అయ్యప్ప తెలిపారు. సీఐ శంకర్‌కుమార్, ఎస్‌ఐ గోపాల్, వెంకటనారాయణ పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**ఆమనగల్లు** : కల్వకుర్తి నియోజకవర్గంలో ఏడు మండలాలు రెండు పురపాలిక సంఘాల్లో 244405 ఓటర్లు ఉండగా, పురుషులు 123434, మహిళలు 120970, ఇతరులు ఒకరు ఉన్నారు. 271 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ఎన్నికల విధుల్లో 1705 మంది సిబ్బందిని నియమించింది. ఆమనగల్లు మండలంలో 31381 ఓటర్లు ఉండగా పురుషులు 15705, మహిళలు 15676 మంది ఓటర్లు ఉన్నారు. మాడ్గుల మండలంలో మొత్తం 44189 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 22541, మహిళలు 21648 ఉన్నారు. కడ్తాల్ మండలంలో 33723 ఓటర్లు ఉండగా పురుషులు 17297, మహిళ ఓటర్లు 16425 ఉన్నారు. తలకొండపల్లి మండలంలో మొత్తం ఓటర్లు 37365 మంది ఉండగా పురుషులు 18890, మహిళ ఓటర్లు 18475 మంది ఉన్నట్లు తహసీల్దార్ లలిత తెలిపారు.


మొయినాబాద్‌లోని చిలుకూరు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది, ఈవీఎంలు


పెద్దఅంబర్‌పేట : పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు


యాచారం : నల్లవెల్లిలో పోలింగ్ బూత్‌కు చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది



మొయినాబాద్ : అజీజ్‌నగర్ పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బంది

## విధుల్లో రెండు వేల మంది సిబ్బంది


డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల అధికారులు, సిబ్బంది

షాబాద్, మే 12 : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ లోక్‌సభ పరిధిలోని షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబుపేట మండలాల్లో మొత్తం 2,69,960 మంది ఓటర్లుండగా..అందులో పురుషులు 1,35,429, స్త్రీలు 1,34,526, ఇతరులు ఐదుగురు ఉండగా.. 298 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మండలానికి ఒకటి చొప్పున మహిళా సిబ్బందిచే నిర్వహించబడే పోలింగ్‌స్టేషన్లు, మాడల్ పోలింగ్ స్టేషన్లు షాబా ద్ మండలంలోని పోతుగల్‌లో దివ్యాంగ పోలింగ్ కేంద్రాన్ని(పీఎస్ నం-230), మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్‌లో యూత్ పోలింగ్ కేంద్రాన్ని(పీఎస్ నం-145)ఏర్పాటు చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ మౌలిక వసతులను కల్పించారు. వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం వీల్‌చైర్లు, వారికి సహకరించేందుకు వలంటీర్లను నియమించారు. చేవెళ్లలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక సందర్శించి పోలింగ్ నిర్వహణపై సిబ్బందికి తగు సూచనలు చేశారు.

**భారీ బందోబస్తు**

లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం నియోజకవర్గంలో రెండు వేల మంది సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. ఆదివారం చేవెళ్ల మండలంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి వారు ఈవీఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని తీసుకుని తమకు కేటాయించిన కేంద్రాలకు బస్సుల్లో తరలివెళ్లారు. పోలింగ్ కేంద్రాల అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన వాటిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వెబ్‌కాస్టింగ్ ద్వారా సహాయ ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి అధికారులు పోలింగ్ సరళిని పరిశీలించనున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న వివిధ విభాగాల ఉద్యోగులు 2176 పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 312 మంది వృద్ధులు, దివ్యాంగులు హోం ఓటింగ్ ద్వారా ఓటేశారు.



**ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి**

లోక్‌సభ ఎన్నికలు సమర్థవంతంగా, స్వేచ్ఛయుతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి.

**–సాయిరాం, చేవెళ్ల అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి**

## ఇబ్రహీంపట్నం సెగ్మెంట్‌లో 3,39,341మంది ఓటర్లు



ఇబ్రహీంపట్నం, మే 12 : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికలకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సిబ్బంది ఈవీఎంలు, సామగ్రితో తమకు కేటాయించిన గ్రామాలకు తరలివెళ్లారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,39,341మంది ఉండగా.. 343 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. పోలింగ్ నిర్వహణ కోసం 1372 మంది విధులు నిర్వహించను న్నారు.

**నియోజకవర్గంలోని ఓటర్లు.. పోలింగ్ కేంద్రాల వివరాలు**

| మండలం | పోలింగ్ కేంద్రాలు | ఓటర్లు |
|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 76 | 72,468 |
| యాచారం | 59 | 48,656 |
| మంచాల | 45 | 40,029 |
| అబ్దుల్లాపూర్‌మెట్ | 163 | 1,78,188 |

**స్వేచ్ఛగా ఓటేయాలి : అనంతరెడ్డి, ఆర్డీవో**



లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాం. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓటర్లు ఓటేయొచ్చు.


డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో వెళ్తున్న సిబ్బంది